ఏకదంతాయ.. వక్రతుండాయ..



మహబూబ్‌నగర్ పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడు

● మరిన్ని ఫొటోలు 6లో..

● ముఖం చూపిస్తేనే పౌష్టికాహారం...

ఈ యాప్‌లో లబ్ధిదారుల పూర్తి వివరాలు, ఆహారం, ఇతర వస్తువులు తీసుకెళ్లేందుకు వచ్చేవారి వివరాలు నమోదు చేస్తారు. వివరాలతో పాటు వారి ఫోటోలను కూడా అప్‌లోడ్ చేస్తారు. ఒక్క క్లిక్ చేస్తే లబ్ధిదారుల వివరాలన్నీ అందులో కనిపిస్తాయి. లబ్ధిదారులు కూడా ఆ వివరాలను, వారికి అందించే పౌష్టికాహారం వివరాలు చూసుకునే అవకాశం కల్పించారు. ఈ మేరకు ముఖం చూపిస్తేనే ప్రతినెల వారికి పౌష్టికాహారం ఇస్తారు. లబ్ధిదారులు కచ్చితంగా సెంటర్‌కు వచ్చి వారి ఫోటో చూపించి పౌష్టికాహారం తీసుకోవలసి ఉంటుంది. లేదంటే అవి వెనక్కి వెళ్లిపోతాయి. దీనివలన ప్రతినెల ఎంతమంది వస్తున్నారు. వారికి పౌష్టికాహారం ఎంత అవసరం, ఎంత మిగిలింది, ఇంకెంత ఇవ్వాలి, ఏదైనా పక్కదారి పట్టిందా అనే ప్రతీ వివరాలు తెలిసే అవకాశం ఉంది.

● యాప్‌లో నమోదుకు ఆపసోపాలు...

యాప్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేసినపుడు వెంటనే కనిపిస్తున్నప్పటికీ ముఖ ధ్రువీకరణ వచ్చేసరికి అప్‌డేట్ కావడం లేదు. యాప్ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని పెట్టినప్పటికీ బాధ్యులు సక్రమంగా స్పందించడం లేదు. మెయిల్, స్క్రీన్‌షాట్లు పెట్టమని మాత్రమే చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. యాప్‌లో ఆధార్ వివరాల ప్రకారం నమోదైన వారు అందుబాటులో ఉండడం లేదు. పాత ఫోన్ నంబర్లు ఉండడం, చిన్నఫోన్లు ఉండడం, ఓటీటీ నంబర్ సమస్యలు తరచూ వస్తున్నాయి. మరికొందరు ఫొటోలు దిగడానికి ముందుకు రావడం లేదు. యాప్‌లో నమోదు చేసేందుకు నెట్‌వర్క్ సమస్యతో పాటు ఫోన్ సామర్థ్యం కూడా సరిపోవడం లేదు.

ముఖం చూపిస్తేనే..

● బాలామృతం, పాలు, గుడ్లు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా పోషణ్ అభియాన్ విధానం
- అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్రం నిర్ణయం
- యాప్‌లో వివరాల నమోదులో జాప్యం



సెల్‌ఫోన్ ద్వారా హాజరు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు అందించే ఆహారం, బాలామృతం తదితరాలు పక్కదారి పట్టకుండా కేంద్రం చెక్ పెట్టనుంది. ఇవి అందాలంటే ఇకపై ముఖం చూపించాల్సిందే. ఇందుకోసం పోషణ్ అభియాన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ యాప్‌లో లబ్ధిదారుల వివరాలను నమోదు చేసి పారదర్శకంగా ఉండేందుకు ప్రవేశపెట్టిన ఈ విధానం జిల్లాలో ఆపసోపాలు పడుతోంది. కొన్ని సాంకేతిక కారణాల వలన లబ్ధిదారుల వివరాల నమోదు ఆలస్యంగా సాగుతోంది. మొత్తానికి ఈ విధానం పూర్తిస్థాయిలో అమలు చేస్తే అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది.

అంగన్‌వాడీ ప్రాజెక్టు	కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	0-6 నెలలలోపు పిల్లలు	6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు	3-6 ఏళ్లలోపు పిల్లలు
దేవరకద్ర	257	872	387	374	4,826	2,581
జడ్చర్ల	311	1,058	594	605	6,356	3,546
మహబూబ్‌నగర్(రూరల్)	271	715	373	364	4,491	2,392
మహబూబ్‌నగర్(అర్బన్)	344	1,642	1,119	1,133	10,249	6,323
మొత్తం	1163	4,287	2,473	2,476	25,922	14,842

● పోషణ్ అభియాన్ యాప్...

అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6 వయసు గల పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు బాలామృతం, పాలు, గుడ్లు, ఒకపూట భోజనం వంటి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అయితే ఇవన్నీ పక్కదారి పడుతున్నాయి. కొన్ని కేంద్రాల్లో గుడ్లు, పాలు, బాలామృతం బయటి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అంతేకాకుండా ఎవరు రాకపోయినా వచ్చినట్లు, వారికి వంట చేసి పెట్టినట్లు కూడా రికార్డుల్లో చూపిస్తున్నారు. దీంతో నిజమైన అర్హులకు ప్రయోజనం అందడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పోషణ్ అభియాన్ ట్రాకర్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

ఘనంగా ప్రారంభమైన నిమజ్జనం

- కొండారెడ్డిపల్లి చెరువు వినాయక్‌ఘాట్ దగ్గర సందడి

నారాయణపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటలో పదో రోజు అనంత చతుర్దశిన వినాయక నిమజ్జన వేడుకలు జరుగుతాయి. అయితే ఇళ్లలో ప్రతిష్ఠించిన చిన్న వినాయక విగ్రహాలను పలువురు ఐదో రోజు ఆదివారం సాయంత్రం కొండారెడ్డిపల్లి చెరువు ఘాట్ దగ్గరికి వెళ్లి పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. దీంతో వినాయక్ ఘాట్ దగ్గర జనాల సందడి కానవచ్చింది.



బుజ్జి గణపతిని నిమజ్జనం కోసం తీసుకొచ్చిన చిన్నారి



పేట కొండారెడ్డిపల్లి వినాయకఘాట్ దగ్గర నిమజ్జనం సందడి

భూ నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జోషి

నారాయణపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జోషి, భూ నిర్వాసితుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి హెచ్చరించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో జరుగుతున్న భూ నిర్వాసితుల రిలే దీక్షలు ఆదివారం నాటికి 48వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. మంత్రి మన వారే.. ముఖ్యమంత్రి మనవారే.. కానీ, భూ నిర్వాసితులకు న్యాయం జరగకపోవడం ఏమిటని ప్రశ్నించారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వడం లేదన్నారు. నారాయణపేట జిల్లాపై వివక్ష ప్రదర్శిస్తున్నారని అన్నారు. అన్ని విధాలుగా వెనుకబాటుకు గురైన నారాయణపేట జిల్లాకు ప్రాజెక్టు కావాలి.. నీళ్లు రావాల్సిందేనన్నారు. అదే సందర్భంలో భూ నిర్వాసితులకు న్యాయమైన పరి హారం అందించాలన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జోషి

ఈ దీక్షలలో భూ నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, అధ్యక్షుడు మశ్చందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఉడుమల్గిద్ద గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండమీది బలరాం, భూ నిర్వాసి తుల సంఘం ఉపాధ్యక్షులు ధర్మరాజు గౌడ్, గోపాల్‌రెడ్డి, అంజి, అంజప్ప, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

- జిల్లా క్రీడాకారులు ఒలింపిక్ స్థాయికి ఎదగాలి
- వాలీబాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్
- ముగిసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నీ



అండర్-16 బాలుర చాంపియన్‌షిప్ రంగారెడ్డి క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న శాంతికుమార్ తదితరులు



డిస్కస్‌త్రోలో బంగారం, షాట్‌పుట్‌లో కాంస్య పతకాలు సాధించిన పౌర్ణమితో శాంతికుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్ అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో నిర్వహిస్తున్న జి.రాజేంద్రప్రసాద్ స్మారక 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-14, 16, 18, 20 జూనియర్ బాల, బాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. ఆదివారం ముగిం పు కార్యక్రమానికి జిల్లా వాలీబాల్

- మిగతా 6లో..

నిమజ్జనానికి పటిష్ఠ బందోబస్తు

- ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక నిమజ్జనానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ డి. జానకి తెలిపారు. సోమవారం జిల్లాలో దాదాపు 500 గణపతి విగ్రహాల నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ టెలికాన్ఫరెన్స్ ద్వారా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు, ఎస్‌హెచ్‌వోలకు స్పష్టమైన ఆదేశాలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిమజ్జన వేడుకలు శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేలా ప్రతీ విభాగం అప్రత్తతతో పని చేయాలని సూచించారు.

ప్రతి నిమజ్జన ఘాట్ వద్ద పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్ అమలు చేయాలని తెలిపారు. రాత్రి వేళల్లో కూడా పర్యవేక్షణ కోసం స్పాట్‌లైట్లు, శక్తివంతమైన లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. మహిళలు, చిన్నపిల్లలు అధిక సంఖ్యలో నిమజ్జన వేడుకల్లో పాల్గొనే అవకాశాలు ఉండడంతో మహిళా పోలీసులను ప్రత్యేకంగా బందోబస్తు కార్యక్రమాల్లో వినియోగించాలన్నారు. మహిళలపై అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. పోలీస్ కంట్రోల్ రూంలో ప్రత్యేక మానిటరింగ్ ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు.

ఉత్సవాల్లో మద్యం సేవించి హం గామా చేసే వారిని గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమో దు చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

మునిసిపల్, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో, గ్రామ పంచాయతీ సిబ్బందితో సమన్వ యం చేసుకుని నిమజ్జన ఘాట్‌ల వద్ద ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రజలందరు శాంతియుతంగా నిమజ్జన వేడుకలు నిర్వహించుకోవాలని ఎస్పీ సూచించారు.

వర్షాలు అధికం..

నష్టం అపారం

- నీట మునిగిన పత్తి, కంది, వరి
- నీటి నిల్వలతో ఊటకట్టి కుళ్లుతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



ఊట్కూర్ మండలం అమీన్‌పూర్‌లో నీట మునిగిన పత్తి పంట (ఫైల్)



దామరగిద్ద మండలం లింగారెడ్డిపల్లిలో దెబ్బతిన్న పెసరపంటను చూపిస్తున్న మొగులప్ప



కూరగాయల తోటలకు నష్టం

ధన్వాడ మండలం పాతపల్లి గ్రామం అందేరి తిరుమలమ్మ, రాములుకు చెందిన అర ఎకరాలో వంకాయ, టమాటా, బెండకాయ, మిర్చి తోటలు అధిక వర్షాలతో నష్టం జరిగింది. లక్ష రూపాయల పెట్టుబడి పెడితే 40 వేలు వచ్చాయి. అధిక వర్షాల వల్ల 60 వేలు నష్టం జరిగింది. గత ఏడాది వర్షాకాలంలో ఎకరాలో పచ్చిమిర్చి సాగు చేస్తే రెండు లక్షలు పెట్టుబడి పెడితే వర్షాలతో పంటకు తెగుళ్లు వ్యాపించాయి. తీరా చివరలో వర్షాభావంతో బోరులో నీరు తగ్గి తోటకు నీరందక లక్ష నష్టం జరిగింది. అయితే రెండులక్షల పైబడి వ్యవసాయ రుణం ధన్వాడ యూనియన్ బ్యాంక్‌లో ఉండగా ప్రభుత్వం నుంచి రైతు రుణామాఫీ కాలేదని వాపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- తిరుమలమ్మ పాతపల్లి గ్రామం, ధన్వాడ

నారాయణపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో అధికంగా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో పత్తి, కంది, వరి పంటలు నీట మునిగి అపార నష్టం వాటిల్లింది. దాంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అష్టకష్టాలు పడి పెట్టుబడులకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక అంచనా మేరకు పత్తి పంట 1437 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. కంది పంట 493 ఎకరాల్లో నష్టం చేకూరింది. వరి పంట 884 ఎకరాల్లో నీట మునిగింది. 38 ఎకరాల్లో పెసర పంటకు నష్టం జరిగింది. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలతో పత్తి, కంది పంటలు ఊట కట్టి మొక్కలు ఎర్రబడి పోతూ కొన్నిచోట్ల కుళ్లిపోతున్నాయని వాపోతున్నారు. అధిక వర్షాల వల్ల పత్తి పూతతో పాటు పత్తి పిందెలు, కాయలు రాలిపోయి నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు.

మండలాల వారిగా నష్టం వివరాలు..

మరికల్ మండలంలో కంది 60 ఎకరాల్లో, పత్తి పంట 100 ఎకరాలు నీట మునిగి నష్టం జరిగింది. ధన్వాడ మండలంలో పత్తి 45 ఎకరాలు, కంది 30 ఎకరాలకు పంట నష్టం జరిగింది. మక్తల్ మండలంలో వరి 114 ఎకరాలు, పత్తి 325 ఎకరాలు, కంది 310 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. మాగనూర్ మండలంలో వరి 367 ఎకరాల్లో, పత్తి పంట 390 ఎకరాల్లో, కంది 25 ఎకరాల్లో నష్టం చోటుచేసుకున్నది. కృష్ణ మండలంలో వరి పంట 268 ఎకరాలు, పత్తి 266 ఎకరాల్లో నష్టం చేకూరింది. కొత్తపల్లి మండలంలో ఒక ఎకరా పత్తి పంట వర్షం నీటిలో మునిగి నష్టం జరిగింది. కోస్గి మండలం మునిరిఫా గ్రామంలో 30 ఎకరాల వరి పంట నీటిలో మునిగింది. దామరగిద్ద మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలో పెసర 30 ఎకరాలు, పత్తి పంట 20 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఊట్కూర్ మండలంలో వరి 105 ఎకరాలు, పత్తి 128 ఎకరాలకు నష్టం చేకూరింది. నారాయణపేట మండలంలో పెసర 8 ఎకరాలు, కంది 68 ఎకరాలు, పత్తి 162 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో కూరగాయల తోటలకు సైతం నష్టం చోటుచేసుకున్నది.

యూరియా కేటాయించాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ గోపిని కలిసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల నియోజకవర్గంలో యూరియా కొరత లేకుండా కేటాయింపు జరపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ గోపిని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. ఆదివారం అసెంబ్లీలోని లాంజ్‌లో వ్యవసాయశాఖ కమిషనర్ గోపి, అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌లను కలిసి జడ్చర్ల నియోజకవర్గంలో యూరి యా కొరత గురించి వివరించారు. యూరియా అందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు.

దీనికి స్పందించిన కమిషనర్ జడ్చర్ల నియోజకవర్గానికి యూరియాను అందచేస్తామని తెలిపారని ఎమ్మెల్యే చెప్పారు. యూరియా కొరతను నివారించేందుకు ఎమ్మెల్యే చర్యలు చేపడ్తుం డడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ గోపిని కలిసిన జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

ఘనంగా పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బసవేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం ముగింపు సందర్భంగా ఆదివారం పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 7:30 నిమిషాలకు గంగా జలంతో శ్రీవారికి రుద్రాభిషేకం పూజ, అష్టోత్తరం మహా మంగళ హారతితో నిర్వహించారు. శ్రీవారిని పల్లకిలో ఉంచి ఆలయం నుంచి సెంటర్ చౌక్ నుంచి పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గాంధీనగర్‌లో వెలసిన లింగయ్య స్వామి ఆలయానికి చేరి.. అక్కడి నుంచి తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా శ్రీహరి ఆలయం ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. బసవేశ్వర దేవాలయం ధర్మకర్త బుసయ్య స్వామి, పూజారులు శివకుమార్ స్వామి, బాలింగం సంగు మల్లికార్జున్, సులింగం గుండప్ప, జాజాపూర్ జయప్రకాష్, ఆనంద్, రవి, పవిత్ర భక్తులు పాల్గొన్నారు.

మద్దూర్‌లో గుట్కా ప్యాకెట్ల పట్టివేత 7

రిటైర్డ్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అర్బన్ నక్సలైట్ అనడం తగదు

- పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి

7

ఏకదంతాయ.. వక్రతుండాయ..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఊరూరా ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద జన సందడి నెలకొన్నది. వివిధ ఆకృతుల్లో, అలంకరణల్లో కొలువుదీరిన బొజ్జ గణపయ్యను భక్తులు దర్శించుకొని పూజలు చేస్తున్నారు.

- నెట్‌వర్క్ ఆంధ్రజ్యోతి


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బోలా శంకరుని సమేతంగా దర్శమిస్తున్న వివేకనంద యూత్ వినాయకుడు


మహబూబ్‌నగర్‌లో భగత్‌సింగ్ విగ్రహం వద్ద గణపతి


లింగంబావి సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం


అమరచింత సంతోష్ నగర్‌లో పూజలు అందుకుంటున్న గణనాథుడు


నాగర్‌కర్నూల్‌లో సింహ వాహనంపై ఆసీనులై పూజలు అందుకుంటున్న మైల్‌స్టోన్ యూత్ వినాయకుడు


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సూర్య భగవాన్ రథం ముందు ఆసీనులై దర్శమిస్తున్న సెలక్షన్ సిండికేట్ వినాయకుడు


మహబూబ్‌నగర్ జిల్లా గడియారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన గణేశుడు


సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో విఘ్నేశ్వరుని పాల రాతి విగ్రహం


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శివతాండవ దేవతా మూర్తుల మధ్య పూజలు అందుకుంటున్న వీర శివాజీ యూత్ వినాయకుడు


మహబూబ్‌నగర్ భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా దర్శనమిస్తున్న రెబల్ యూత్ వినాయకుడు

మైసమ్మ దేవతకు పూజలు


నాయినోనిపల్లి మైసమ్మ దేవతకు పూజలు చేస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల్, వనపర్తి జిల్లాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. భక్తుల నుంచి ఆదివారం టికెట్ల ద్వారా రూ.42,805, హుండీ ద్వారా రూ.40,820 మొత్తం రూ.83,625 ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ, ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

జూపల్లిలో ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు


పెద్దమ్మ దేవతకు బోనాలు తీసుకెళ్తున్న యాదవ కులస్థులు

చారకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూపల్లిలో యాదవ కులస్థుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి బోనాలను యాదవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనం కుండలకు పసుపు, కుంకుమ, వేపాకులు, మామిడి తోరణాలతో అలంకరించారు. డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని నృత్యాలు, పూనకంతో ఊగారు. యువతి, యువకులు నృత్యాలు చేసుకుంటు ఊరేగింపుగా రేణుకాఎల్లమ్మ దేవత ఆలయానికి చేరుకొని అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్, యాదవులు భిక్షపతియాదవ్, రాములుయాదవ్, జంగయ్య, మల్లయ్య, శ్రీను, లింగం, మల్లేష్, శ్రీరాములు, రాజుయాదవ్, కార్తిక్‌యాదవ్ పాల్గొన్నారు.

కోతకు గురైన సీసీ రోడ్డు


సిర్సవాడలో మాదారం వెళ్లే రహదారిపై కోతకు గురైన సీసీ రోడ్డు

తాడూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడలో మాదారం వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న సీసీ రోడ్డు ఇటీవల భారీ వర్షాలు కురవడంతో కోతకు గురైంది. దుందుభీ నది సమీపంలో ఈ సీసీ రోడ్డు పూర్తిగా కోతకు గురై విరిగిపోయే పరిస్థితి నెలకొంది. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ప్రధాన రహదారులను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ప్రధానంగా రహదారులపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలు పూర్తిగా దెబ్బతినడంతో గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విస్తృత ప్రచారం
- నేటి నుంచి పోషకాహార మాసోత్సవం

ఖిల్లాఘణపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తిండి కలిగితేనే కండ కలదోయే.. కండ కలవాడే మనిషోయ్.. అని మహాకవి గురజాడ అప్పారావు వర్ణించినట్టుగా ప్రస్తుత సమాజంలోని మనుషులు పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారు. పట్టణాల్లో, పల్లెల్లో అనే తేడా లేకుండా అవగాహన లోపంతో మధుమేహం, రక్తపోటు, గుండె, జబ్బులాంటి అనారోగ్యాలకు గురవతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం పౌష్టికాహారం లోపంతో మాతా, శిశు మరణాలు, బరువు తక్కువ పిల్లలు జన్మిస్తున్నారని నిర్ధారించారు. వీటి నివారణకు కేంద్ర ప్రభుత్వం జాతీయ పౌష్టికాహార మిషన్‌ను ప్రారంభించింది. ప్రతీ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 30 వరకు పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహార ప్రాధాన్యం, రక్తహీనత సమస్యల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గృహ సందర్శన చేసి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. పోషకాహార లోపంతో ఏడాదికి చాలా మంది చిన్నారులు, పెద్దలు, బాలింతలు చనిపోతున్నారు. మనం తినే ఆహారంలో ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్‌తో కూడిన పరిపూర్ణ ఆహారంతో రోగాలు దూరం అవుతాయి. కూరగాయలు పండ్లు, పప్పు దినుసులు, గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలువలు, జీడిపప్పు బాదం, వాల్ నట్స్ ఇతర వంటకాల్లో పౌష్టికాహారం లభిస్తుంది. మనం తీసుకునే ఆహారంలో కొవ్వు పదార్థాలు, చక్కెర, ఉప్పు, మితంగా వాడితే ఆరోగ్యానికి మంచిది.


పోషక పదార్థాలతో అవగాహన కార్యక్రమం


అంగన్‌వాడీ కేంద్రంలో పోషక కూరగాయలతో కూడిన వెయ్యి రోజుల ప్రాముఖ్యత తెలిపే ప్రదర్శన

పోషణ అభియాన్...

2018 మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ పోషణ్ అభియాన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం లోపం లేకుండా చేయడమే పోషణ్ అభియాన్ లక్ష్యంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రతీ 6 నెలలకు ఒకసారి పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సెప్టెంబరు మాసంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సిబ్బంది ప్రతీరోజు పోషకాహారానికి సంబంధించి ఒక్కో అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ర్యాలీలు, సమీక్షలు, గృహ సందర్శన క్షేత్రస్థాయిలో నిర్వహించి కేంద్ర ప్రభుత్వ వెబ్ సైట్‌లో ఫోటోలను పొందుపరుస్తారు. పోషక మాసోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 0 నుంచి 2 సంవత్సరాల వరకు మొత్తం 1000 రోజుల ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తహీనత లేకుండా పౌష్టికాహారం అందే విధంగా చర్యలు చేపడుతారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువు, ఎత్తులను నమోదు చేస్తూ వ్యత్యాసాలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి సూచనలు సలహాలు అందిస్తారు.

వనపర్తిని పోషక లోప రహిత జిల్లాగా మార్చుదాం



జిల్లాను పోషక లోప రహిత జిల్లాగా మార్చు చేద్దామని పిలుపునిచ్చారు. మహిళల్లో రక్త హీనత సమస్య లేకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు. ఐసీడీఎస్ సిబ్బంది గర్భిణులు, బాలింతల గృహ సందర్శన చేసి కుటుంబ సభ్యులకు పోషకాహారంపై సూచనలు చేస్తున్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు, బరువుల ప్రగతిని నమోదు చేస్తాం. 1,000 రోజుల ప్రాముఖ్యత తెలుపుతూ పోషక మాసోత్సవంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం.

- సుధారాణి, జిల్లా సంక్షేమ అధికారి, వనపర్తి

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

(5వపేజీ తరువాయి)

సంఘం అధ్యక్షుడు శాంతికుమార్, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్‌లు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తి చాటాలన్నారు. రాష్ట్ర క్రీడాకారులు ఒలంపిక్ స్థాయికి ఉదగాలని ఆకాంక్షించారు. రాజేంద్రప్రసాద్ పేరిట రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం పట్ల నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోపియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టోనీమార్టిన్, శరత్‌చంద్ర, ట్రెజరర్ ఆనంద్‌కుమార్, కోచ్ సునీల్, పీడీలు రమణ, పి.శ్రీనివాసులు. సి.శ్రీనివాసులు. రాఘవేందర్, రమేష్‌బాబు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


టోర్నీలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఖమ్మం క్రీడాకారులు


అండర్-16 బాలికల చాంపియన్‌షిప్ హన్మకొండ

విజేతలు వీరే.....

ఓవరాల్ చాంపియన్ ఖమ్మం మరియు బాలికల అండర్-20 చాంపియన్ షిప్ మహబూబ్‌నగర్

చాంపియన్‌షిప్ విజేతల వివరాలు ఇలా..

ఓవరాల్ చాంపియన్‌షిప్ ఖమ్మం జిల్లా జట్టు కైవసం చేసుకుంది. అండర్-20 బాలికల విభాగంలో 20 పాయింట్లతో మహబూబ్‌నగర్ జట్టు, బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు 28 పాయింట్లతో చాంపియన్‌షిప్‌గా నిలిచాయి.

అండర్-16 బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు, బాలికల విభాగంలో హన్మకొండ జట్టు, అండర్-18 బాలుర విభాగంలో ఖమ్మం, బాలికల విభాగంలో హైదరాబాద్ జట్లు చాంపియన్‌గా నిలిచాయి. వ్యక్తిగత విభాగంలో జిల్లా అథ్లెట్ పౌర్ణమి స్వర్ణ, షాట్ ఫుట్‌లో కాంస్య పతకం అందుకుంది.

ఏడు యూనిట్లలో జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి భారీగా వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో యూనిట్ల ద్వారానే విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి 3.561 మిల్లియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 265.643 మిల్లియన్ యూనిట్లను రాబట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జ్వరాలు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఒక్క యూనిట్ మాత్రమే ప్రారంభించి 3.16 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 295.523 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు ఆయన తెలిపారు. కృష్ణా నది ద్వారా అత్యధికంగా వరద వస్తుండడంతో ఉత్పత్తి అనంతరం దిగువకు నీరు సులభతరంగా వెళ్లక బ్యాక్ వాటర్‌గా నిలిచిపోవడంతో ఆరు యూనిట్లను ప్రారంభించడం సాధ్యపడకపోవడంతో ఒక్క యూనిట్‌ను మాత్రమే ప్రారంభించి ఉత్పత్తిని కొనసాగిస్తున్నామని తెలిపారు. వరద ఇదే మాదిరిగానే కొనసాగితే త్వరలోనే నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉందని తెలిపారు.

యూరియా కొరతను నివారించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిండెంట్ కుంభం మల్లేష్‌గౌడ్


సమావేశంలో పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేసి తెలంగాణలో యూరియా కొరత లేకుండా చూడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిండెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమం సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో ఈ వానాకాలం వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు విస్తృతంగా పండిస్తున్నారన్నారు. ఈ పంటలు ఏపుగా పెరిగేందుకు రైతులు యూరియాతో పాటు నైట్రోజన్ ఎరువుపై ఎక్కువగా ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడం, సాగునీటి ప్రాజెక్టుల్లోకి సరిపడా నీరు రావడంతో ఈ సారి రైతులు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 118 లక్షల ఎకరాల్లో పటలు సాగు చేశారన్నారు. గతేడాది కంటే 27 శాతం అధికంగా పంటలు సాగు చేయడం కారణంగా రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్, నాయకులు నిరంజన్‌యాదవ్, సుధాకర్‌గౌడ్, గంగోజీ, పబ్బతి శ్రీనివాసులు, రవీందర్‌గౌడ్, కొత్త శ్రీనివాసులు, రాజు, చైతన్య పాల్గొన్నారు.

రాయలసీమకు తరలి వెళ్తున్న యూరియా


ఆటోలో కృష్ణానది ఒడ్డుకు తీసుకొచ్చిన యూరియా సంచులు

పెంట్లవెల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లేశ్వరం, మంచాలకట్ట కృష్ణానది మీదుగా మరబోటులో రాయలసీమ ప్రాంతానికి యూరియా బస్తాలను తరలిస్తున్నారు. కొల్లాపూర్ ప్రాంతంలోని సొసైటీల ద్వారా స్థానికంగా ఉండే రైతుల ద్వారా పేరు నమోదు చేయించుకొని యూరియా బస్తాలను రాయలసీమ దళారులకు అమ్ముకుంటున్నారు. మంచాలకట్ట నుంచి కొండపాటూరు, కొణిదెల, ముచ్చుమర్రి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

అదే విధంగా మల్లేశ్వరం నుంచి కపిలేశ్వరం, మాడుగుల, కొత్తపల్లి గ్రామాలకు యూరియా తరలిస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలో యురియా కొరత ఏర్పడి స్థానికంగా ఉండే రైతులకు అందక నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో తెలంగాణ నుంచి రాయలసీమ ప్రాంతానికి యూరియాను తరలిస్తున్నారు.

బైక్ ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు

గోపాల్‌పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బైక్ ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన వెంకటయ్య రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. వడ్డేగేరి కాలనీకి చెందిన చిన్నబాబు బైక్‌పై పోచమ్మ ఆలయం నుంచి కల్లు దుకాణం రోడ్డుకు వస్తూ.. వెంకటయ్యను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని మండల కేంద్రంలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి వారిని వనపర్తి ఆసుపత్రికి తరలించారు.



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాన మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగిరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

- నాపై 181 కేసులు బనాయించారు
- ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
- చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
- 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
- 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పుడు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పూ చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా.. సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

- 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
- 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
- కేరళలో పాంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు



విద్యార్థినికి పాంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పాంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.

ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్షపాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు సగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో సగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

క్రైం కార్నర్

ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

చిన్నంబావి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెలగొండ గ్రామంలో నారాయణ కల్లందొడ్డిలో ఆదివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల భార్య చనిపోవడంతో మనస్థాపానికి గురైనట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలియజేశారు.

మద్దూర్‌లో గుట్కా ప్యాకెట్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ప్యాకెట్లు

మద్దూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నారాయణ పేట జిల్లా మద్దూర్‌లో ప లు కిరాణ షాపుల్లో పో లీసులు ఆదివారం తనిఖీ చేపట్టారు. పట్టణంలోని సీఆర్ కిరాణంలో విక్రయా నికి నిల్వ ఉంచిన రూ. 15,235 విలువ గల గుట్కా, జర్దా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్.ఐ విజయ్‌కుమార్ తెలిపారు. నిషేధిత గుట్కను విక్రయిస్తున్న యజమాని విష్ణుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మరికల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీలేరు స్టేజీ సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. మండలంలోని రాకొండ గ్రామానికి చెందిన ఉపేంద్ర బైక్‌పై మండల కేంద్రానికి వస్తున్నాడు. ఈ క్రమంలో తీలేరు స్టేజీ సమీపంలో లారీ, బొలెరో, బైక్ వరసగా ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఉపేంద్ర ఎగిరి పడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ రాము ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాట స్థావరాలపై దాడులు

- ఐదుగురి అరెస్ట్

కృష్ణ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరాలపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.14,200 నగదు, పేకాట ముక్కలు స్వాధీనపరుచుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని చేగుంట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారం అందుకుని మధ్యాహ్నం ఎస్ఐ నవీద్, సిబ్బందితో కలిసి స్థావరాలపై దాడులు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాకు చెందిన ఐదుగురిని పట్టుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలిపై దాడిచేసిన పోస్టుమన్‌పై కేసు నమోదు

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆసరా పింఛన్ కోసం వెళ్లిన వృద్ధురాలిపై దాడి చేసిన పోస్టుమన్ షేక్ గులాంనబీపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. మానవ పాడు మండలం చెన్నిపాడుకు చెందిన వృద్ధురాలు పద్మావత మ్మపై శనివారం దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఆదివారం ఆమె, కుమారుడు సంపత్‌కుమార్‌తో కలిసి పోలీసులను ఆశ్రయించింది. తనపై అకారణంగా దాడి చేసి నెట్టివేశారని, అనారోగ్యంతో ఉన్న నేను కుప్ప కూలిపోయాయని తెలిపింది. దాడిచేసిన షేక్ గులాంనబీ పై చర్యలు తీసుకోవాలని కోరింది. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకాంత్ తెలిపారు.

రాజవీధిలో లడ్డూవేలం రూ.1,12,016



వినాయక ఉత్సవ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం



లడ్డూను దక్కించుకున్న ఆంజనేయస్వామి కమిటీ సభ్యులు

గద్వాల టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం ఐదవ రోజు స్థానిక రాజవీధిలోని శ్రీభక్త మార్కండేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో గణనాథుడి లడ్డూకి వేలంపాట నిర్వహించారు. పద్మశాలి యువజన సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి, చేనేత వ్యాపారి బిజ్జి లక్ష్మీనారాయణ రూ.1,12,016లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలి పట్టణ సేవాసంఘం అధ్యక్షుడు నామాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సాయిబాబ, యువజన సంఘం అధ్యక్షుడు అక్కల కుమార్, పద్మశాలి కులబాంధవులు, మహిళలు ఉన్నారు.

గణనాథుడి లడ్డూ వేలం రూ.99,999

ఉప్పునుంతల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూకు ఆదివారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఆంజనేయస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొని రూ. 99,999కు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం గణనాథుడి విగ్రహాన్ని గ్రా మ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ స భ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇంద్రసేనారెడ్డితో పాటు కమిటీ సభ్యు లు ఉన్నారు.

వేలంలో లడ్డూ రూ. 30,116

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలోని వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో ఆదివారం నిర్వహించిన పెద్దలడ్డూను పద్మ, చిరంజీవి దంపతులు రూ.30,116కు వేలంపాట పాడి లడ్డూను దక్కించుకున్నారు. అలాగే చిన్నలడ్డును వాణి, శివకుమార్ రూ. 8,616కు వేలంపాట పాడి దక్కించుకోగా కలశం, చెంబును రూ.2,516లకు జయలక్ష్మి, నర్సన్‌గౌడు దక్కించుకున్నారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తెలుగు నర్సింహులు, చిరు ముదిరాజ్, వీరేశ్, చెన్నకేశవులు, హనుమంతు, వెంకటేశ్‌శెట్టి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులపై పనిభారం తగ్గించాలి

» ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.రవీందర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్ఆర్టీసీ కార్మికులకు పనిభారం తగ్గించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు పనిభారంతో సతమతమవుతున్నారన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు ప్రైవేటు యాజమాన్యానికి అప్పగించడం వల్ల నిర్వహణలో అనేక ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని వెంటనే ఆర్టీసీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఉమ్మడి జిల్లా నాయకులు కృష్ణయ్య, వెంకటయ్య, ప్రేమలత, సుమలత, వెంకటేష్, చింతలయ్య, అయూబ్, అర్జున్ పాల్గొన్నారు.

రిటైర్డ్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అర్బన్ నక్సలైట్ అనడం తగదు

» పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి

పాలమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉపరాష్ట్రపతి అభ్యర్థి, రిటైర్డ్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అర్బన్ నక్సలైట్‌గా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అనడం దుర్మార్గమని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ప్రజాస్వామిక వాదులు, పౌర ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చర్చాగోష్టిలో పాల్గొని మాట్లాడారు. మాట్లాడేవారందరినీ ఏదో నెపంతో వేధింపులకు గురిచేయడం బీజేపీ పాలనలో పరిపాటి అయ్యిందని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎంపీలు డీకే అరుణ, పార్థసారథిరెడ్డి, మల్లురవి రిటైర్డ్ జస్టిస్ సుదర్శన్‌గౌడ్‌కు ఓటు వేయాలని డిమాండ్ చేశారు. పౌర ప్రజా సమూహాలు ఎక్కడికక్కడ ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా ఉపరాష్ట్రపతి బరిలో నిలిచిన సుదర్శన్‌రెడ్డి ఆదర్శవంతమైన ప్రజాస్వామిక వాది అన్నారు. పార్టీలకతీతంగా, ప్రజాస్వామిక వాదులంతా ఆయనకు సంఘీభావంగా నిలబడడం ఆదర్శనీయమన్నారు.

సమావేశంలో సామాజికవేత్త హనీఫ్, విద్యావంతుల వేదిక నాయకులు సతీష్ మాట్లాడారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఖలీల్, ప్రముఖ విద్యావేత్త లక్ష్మణ్‌గౌడ్, సీపీఐ నాయకుడు సురేశ్, ప్రజా సంఘాల నాయకులు వామన్‌కుమార్, కేసీ వెంకటేశ్, ఫారుఖ్‌హుస్సేన్, శ్రీదేవి, ఆయూబ్, బాబర్‌షేక్ పాల్గొన్నారు.

పీయూ తెలుగు శాఖ అధ్యక్షుడిగా మార్క్‌పోలోనియస్

» కొల్లాపూర్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అవకాశం



తెలుగు శాఖ అధ్యక్షుడిగా కొల్లాపూర్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్‌కు నియామక పత్రం అందజేస్తున్న విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్

కొల్లాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు విశ్వ విద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడిగా కొల్లాపూర్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్‌ను నియమిస్తూ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ఆచార్య రమేష్ కుమార్‌లు ఆదివారం నియామక పత్రం అందజేశారు. తెలుగు శాఖ అధ్యక్షుడిగా వీరు రెండేళ్ల పాటు కొనసాగుతున్నారు. ప్రస్తుతం వీరు పాలమూరు యూనివర్సిటీ పీ జీ సెంటర్ కొల్లాపూర్‌లో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. వీరు గతంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పోస్ట్ డాక్టరల్ యూజీసీ ఫెలోషిప్, తెలంగాణ రాష్ట్ర తె లుగు సాహిత్య అవార్డు అందుకున్నారు.

మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ నాగర్‌కర్నూల్ డిస్ట్రిక్ట్ మెంటర్‌గా, గద్వాల పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఈయన దగ్గర ప్రస్తుతం నలుగురు రీసెర్చ్ స్కాలర్స్ పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈయన జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు చైర్మన్‌గా వ్యవహరించారు. ఈయన నియామకంపై అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ అభినందనలు తెలిపారు.

దాడి చేసిన భార్యాభర్తలపై కేసు నమోదు

వెల్దండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన కాసోజీ అనూష ఆమె తల్లి రుక్మిణిపై దాడి చేసి గాయపరిచిన అదే గ్రామానికి చెందిన అపర్ణ ఆమె భర్త తిరుమల్‌రావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ కురుమూర్తి తెలిపారు. కొంత కాలంగా వారి మధ్య నెలకొన్న గొడవల నేపథ్యంలో అపర్ణ, తిరుమల్‌రావులు ఆదివారం ఉదయం అనూష ఇంట్లోకి వెళ్లి ఆమెపై దాడి చేసి గాయపరిచారని, బాధితురాలు అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..

సూచనలు పాటిస్తే రైతులకు లాభాలు

» అఖిలారెడ్డి, ఏవో



నర్వ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటిస్తే రైతులు అధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి అఖిలారెడ్డి అన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు.

మండలంలో వర్షానికి పంటలు దెబ్బతిన్నాయా?

భారీ వర్షానికి మండలంలో ఎలాంటి పంట నష్టం జరగలేదు.

మండలానికి ఎంత యూరియా వచ్చింది?

నర్వ మండలానికి వచ్చిన 16,750 సంచుల యూరియా వచ్చింది. ఇంకా ఎంత కావాలన్నా మండలానికి సరఫరా చేస్తాం.

పత్తిలో రసం పీల్చే పురుగుల నుంచి నివారణ?

పచ్చ దోమ తల్లి, పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగం నుంచి రసం పీల్చడం వలన ఆకులు ముడుచుకొని, లేత పసుపు రంగులోకి మారతాయి. ఆకుల అంచులు ఎరుపు రంగుకు మారి, ఎండి రాలిపోతున్నాయి. దీని నివారణ ఫ్లోనికామిడ్ 0.3, లేదా ఎసిటామిప్రిడ్ 0.2, లేదా డైఫెన్ థయురాన్ 1.25 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

న్యూస్ బాక్స్

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

నారాయణపేటరూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.బాల్‌రాం ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధి సొసైటీ కింద పనిచేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ప్రభుత్వ వసతి గృహాల్లో పనిచేస్తున్న స్వీపింగ్, ఫుడ్ వర్కర్ల వేతనాలు ఎనిమిది నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అలాగే వృద్ధాశ్రమం, బాలల కేంద్రం, సఖి కేంద్రాల్లోని కార్మికులకు ఏడునెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఉపాధి సొసైటీ, సిద్ధి లింగేశ్వర స్వామి సొసైటీలు వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

'కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం'

మద్దూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతోందని సీనియర్ నాయకుడు యాదగిరి పటేల్, బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ యాదవ్ అన్నారు. ఆదివారం మద్దూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. 42శాతం రిజర్వేషన్లు అమలుకు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వాలు బీసీల గురించి పట్టించుకోలేదన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

మాదాసి కురువ కమిటీ ఎన్నిక

నారాయణపేటరూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాదాసి కురువ మండల, నియోజకవర్గ కమిటీలను ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా బండి హన్మంతు, ఉపాధ్యక్షులుగా ఆశప్ప, సాయిలు, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గురాజు, కార్యదర్శిగా సిద్దిరాములు, కోశాధికారిగా చిన్న వెంకటప్ప, గౌరవ అధ్యక్షుడిగా సాలెమల్లప్ప పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దేవాలయానికి సీసీ కెమెరాలు అందజేత

కొత్తపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భూనీడు ఆంజనేయస్వామి ఆలయ భద్రత దృష్ట్యా గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి సీసీ కెమెరాలను అందించారు. దేవాలయ ప్రాంగణంలో అన్ని వైపులా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులు, మద్దూరు ఎస్‌ఐ విజయ్‌కుమార్ సన్మానించారు.

'అనధికారికంగా కార్యక్రమాలు చేపట్టరాదు'

కోస్గి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ అధికారులు డీఎంకు సమాచారం ఇవ్వకుండా రూట్ సర్వేకు వచ్చిన బస్సుకు పూజ చేసి టెంకాయ కొట్టడంపై నారాయణపేట డీఎం లావణ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం డీఎం మాట్లాడుతూ.. శనివారం కోస్గి పోతిరెడ్డిపల్లి మీదుగా షాద్‌నగర్ వెళ్లేందుకు రూట్ సర్వే కోసం బస్సును పంపామన్నారు. సర్వే తర్వాత ఆర్‌ఎం రిపోర్టు పంపితే అనుమతిస్తే బస్సు నడపాల్సి ఉంటుందన్నారు. స్థానిక డిపోలో ఇన్‌చార్జిగా ఉన్న ఓ అధికారి బస్సును పోతిరెడ్డిపల్లిలో ఆపి నాయకులతో బస్సు ప్రారంభమైనట్లు పూజలు చేయడం సరికాదని తెలిపారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మండపాల వద్ద ప్రత్యేక పూజలు

» నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన



నారాయణపేటలో పూజలో పాల్గొన్న డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

నారాయణపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణేష్ మండప నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ లింగయ్య సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కుర్వగేరి, శాతవాహన కాలనీ, పళ్ల ప్రాంతాలలో విగ్రహాలను డీఎస్పీతో పాటు సీఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. మండపాల వద్ద చోరీలు జరగకుండా చూసుకోవాలన్నారు. డీజేలను నిషేధించడం జరిగిందన్నారు. ఎవరికి ఇబ్బంది లేకుండా నడుచుకోవాలన్నారు. శక్తిపీఠంలో స్వామి శాంతానంద ఆధ్వర్యంలో పూజలు చేశారు.

దామరగిద్ద: మండల కేంద్రంతో పాటు బాపన్‌పల్లిలో ఎస్‌ఐ రాజు గణేష్ విగ్రహాల వద్ద పాయింట్ బుక్స్ తనిఖీ నిర్వహించి మండపాల నిర్వాహకులు, వలంటీర్లకు భద్రతాపరమైన సూచనలు ఇచ్చారు.

జక్లేర్‌లో అన్నదానం

మక్తల్‌రూరల్: మండలంలోని జక్లేర్ గ్రామ స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో గంగాధర్, మధుసూదన్ గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మండపాల నిర్వాహకులు భద్రతా పరమైన సూచనలు పాటించాలని ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని గణేష్ ఉత్సవాల సందర్భంగా పాయింట్‌బుక్స్‌ను తనిఖీ చేశారు. హిందువులు ఐక్యంగా పండుగలు నిర్వహించుకోవాలని వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి అద్దాని నరేందర్ అన్నారు. పట్టణంలోని సీతారామ కల్యాణ మండపం బజరంగదళ్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాములు, సత్యనారాయణగౌడ్, జుట్ల హన్మంతు, మల్లికార్జున్‌రావు, భీమేష్, రాహుల్, శివ, శంకర్, శ్రీను, భీంరెడ్డి పాల్గొన్నారు.

ఊట్కూర్: పట్టణంలో ఉత్సవాలను ఆదర్శంగా నిలిచేలా చేసుకోవాలని ఊట్కూర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అరవింద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఊట్కూర్‌లోని శివాజీ నగర్‌లో తపస్ జిల్లా కార్యదర్శి నరసింహా ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో హన్మంతు, నర్సింగప్ప, కరుణాకర్, భాస్కర్, కృష్ణ, గోపాల్, బన్నేష్, భరత్ కుమార్, భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ద్వారా డీజేలకు అడ్డుకట్ట

» సీఐ శివశంకర్



ఎర్రగుట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నారాయణపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చెక్‌పోస్టు ఏర్పాటు ద్వారా డీజేలకు అడ్డుకట్ట వేస్తున్నామని సీఐ శివశంకర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎర్రగుట్ట వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబి ఉత్సవాల నేపథ్యంలో కర్ణాటక నుంచి జిల్లాలోకి డీజేలు రాకుండా తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైన డీజేలు తెస్తే వాటిని సీజ్ చేస్తామన్నారు. వాటిని పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి నాయకున్ని ఎన్నుకోవాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న నాయకులు

ఊట్కూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఆదివారం ఓటు హక్కు, ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆర్‌టీఐ రాష్ట్ర మహిళా కన్వీనర్ హాజమ్మ హాజరై మాట్లాడారు. ప్రజలు తమను పరిపాలించడానికి కావాల్సిన మంచి నాయకుడిని ఓటు ద్వారా ఎన్నుకోవాలన్నారు. దేశంలో అందరికి ఓటు హక్కును కల్పించి ప్రజలే తమ పాలకుడిని ఎన్నుకునే అవకాశం అంబేద్కర్ కల్పించాలన్నారు. ఓటును నిస్వార్థంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, తమకు న్యాయం చేస్తారనే వారినే మాత్రమే ఎన్నుకునేలా ఓటు వేయాలని అన్నారు. శివశంకర్, నారాయణ, బాలరాజు, హన్మంతు, శంకర్, సురేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడా అభివృద్ధికి కృషి

» వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వార్ల విజయ్‌కుమార్



జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న పీఈటీలు

నారాయణపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాలీబాల్ క్రీడా అభివృద్ధికి కృషి చేస్తామని వాలీబాల్ అసోసియేషన్ నూతన జిల్లా అధ్యక్షుడు వార్ల విజయ్‌కుమార్, ప్రధానకార్యదర్శి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వార్ల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దామోదర్‌రెడ్డి, కోశాధికారిగా మక్తల్ రఘు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మండల స్థాయిలో అన్ని సౌకర్యాలతో వాలీబాల్ కోర్టులు నిర్మిస్తామన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో పరిశీలకుడు హనీఫ్, చెన్న వీరయ్య, డీవైఎస్‌వో వెంకటేష్, వెంకటప్ప, బాల్‌రాజ్, సాయినాథ్, అనంతసేన, జగదీష్, నవీన్, పోషల్ వినోద్, మహేష్, తిలక్, శ్రీనివాస్, అమరేష్, అక్తర్‌పాషా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

మక్తల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పరుగుపందెం పోటీల్లో లక్ష్య క్రీడాకారులు ప్రతిభ చాటారు. 600 మీటర్ల పరుగుపందెం బాలుర విభాగంలో బసంత్ బంగారు పతకం సాధించినట్లు కోచ్ జగదీశ్ పేర్కొన్నారు. అలాగే జావలిన్ త్రోలో రాజేశ్వరి వెండి పతకం సాధించినట్లు తెలిపారు. తమతో శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించి సన్మానించారు.

ఊట్కూర్‌లో చెస్ పోటీలు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

ఊట్కూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వినాయక ఉత్సవాల సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో సర్దార్‌నగర్ వినాయక మండపం కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో యువకులకు చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు, యువకులు పాల్గొని ఆడారు.

దేవాలయానికి దాతల విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

ఊట్కూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిజ్వార్ గ్రామంలో పడమటి ఆంజనేయస్వామి ఆలయ గర్భగుడి పునర్నిర్మాణానికి ఆదివారం రైతులు విరాళం అందించారు. రైతు గుయ్యలి నాగిరెడ్డి రూ.1,11,111, ఉప్పరి మారుతి రూ.51,111, మీదిగేరి గణేష్ రూ.50వేలు, మరికల్ కుర్వ శ్రీనివాస్ రూ.51వేల నగదును అధ్యక్షుడు కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డికి అందించారు.

ఘనంగా భగవాన్ బలరామ జయంతి



పూజలో పాల్గొన్న నాయకులు

ఊట్కూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పగిడిమారి గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం భగవాన్ బలరామ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు.రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా మాట్లాడుతూ వ్యవసాయ రైతులకు బలరాముడు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో బస్వరాజ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, జయవంత్‌రెడ్డి, కురువ బీరప్ప, పూజారి శరణప్ప, కిష్టారెడ్డి, వేణుగౌడ్, రఘునందన్ రావు, నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దిగంబర యజ్ఞం

మక్తల్ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచదేవ్‌పహాడ్ సమీపంలోని శ్రీపాద చాయ ఆశ్రమంలో ఆదివారం దిగంబర యజ్ఞం కొనసాగింది. ఆశ్రమ పీఠాధిపతి చింత శ్రీపతిస్వామి, దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహించి దిగంబర శ్రీపాద వల్లభ దిగంబరా అంటూ యజ్ఞం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

యువత రక్తదానంతో ఆదర్శంగా నిలవాలి



రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రం అందిస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి, నిర్వాహకులు

మరికల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దయానంద వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని రిటైర్డ్ ఉపాధ్యాయుడు సుదర్శన్, సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి, అఖిల పక్ష నాయకులు హాజరై ప్రారంభించారు. 50 మంది యువకులు రక్తదానం చేయడం ద్వారా మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణ చూపించారన్నారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

నారాయణపేటరూరల్: యువత రక్తదానం చేసి ఆదర్శంగా నిలవాలని ఆర్‌ఎస్‌ఎస్ పట్టణ సంఘ చాలక్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వినాయక ఉత్సవాల సందర్భంగా మండలంలోని పేరపళ్లలో గ్రామ యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నర్సింహులుగౌడ్, వెంకట్రాములుగౌడ్, భీమేష్, ఆంజనేయులు, శివరాజ్, వెంకటప్ప, వెంకట్‌రెడ్డి, రాజు, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి



కాలప్ప దంపతులను సన్మానిస్తున్న కుంభం శివకుమార్‌రెడ్డి

నారాయణపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, బీజేపీ నాయకుడు నాగురావు నామాజీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కోయిల్‌కొండ ఎంపీడీవోగా పనిచేసిన కాలప్ప ఉద్యోగ విరమణ సభ జరిగింది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కోనంగేరి హన్మంతు, సరాఫ్ నాగరాజ్, బండి వేణుగోపాల్, సుధాకర్, మల్లేష్, మనోహర్‌గౌడ్, కాకర్ల భీమయ్య, అధికారులు పాల్గొన్నారు.

ప్రధానిని దూషించడం సరికాదు : బీజేపీ



సత్యనారాయణచౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నారాయణపేటరూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం బీజేపీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలను ధరించి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు నాగూరావు నామాజీ మాట్లాడుతూ రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిని రాహుల్ గాంధీ దూషించడం సరికాదన్నారు. ప్రధానిని తల్లికడుపున ఎలా పుట్టావని అనడం తగదన్నారు. రాహుల్ గాంధీ నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, కెంచె శ్రీనివాసులు, రఘువీర్ యాదవ్, వినోద్‌కుమార్, జ్యోతిసాయిబన్న, కృష్ణ, సత్యరఘుపాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ సాధించే వరకు పోరాడాలి



మక్తల్‌లో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు

నారాయణపేట రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులపై శాపంగా మారిన సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వై.జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో పోస్టరును విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వెంటనే హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, తిరుపతి, ఎం.రఘువీర్, జనార్దన్, సత్యనారాయణరెడ్డి, రమేష్, గోవర్దన్, వై.నారాయణరెడ్డి, నరేష్, విశ్వనాథ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరుతూ సోమవారం నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ నాయకుడు బాబు అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 23ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సీపీఎస్ విధానం అమలులోకి తెచ్చిందన్నారు. ఉద్యోగుల భద్రతకు ముప్పుగా ఉన్న ఈ విధానం తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చేనేత కార్మికుల ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయాలి



సభ్యులతో మాట్లాడుతున్న కెంచె నారాయణ

నారాయణపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఉన్న గాంధీనగర్‌కు చెందిన చేనేత కార్మికుల ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేసి చేనేత సహకార సంఘంలో వారసత్వ సభ్యత్వం కల్పించాలని చేనేత కార్మిక సంఘం, టీయూసీఐ నాయకుడు కెంచె నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో చేనేత కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 7న సమస్యలపై కలెక్టర్‌కు విన్నవించామన్నారు. దీంతో ఆదివారం జరిగిన సమావేశంలో ఏడీ బాబుతో మాట్లాడినట్లు తెలిపారు. గాంధీనగర్ వీధిలో మంగళవారం ఇంటింటికీ తిరిగి విచారించి, న్యాయం చేస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు.

గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

» బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

నర్వ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల ఇన్‌చార్జిల నమోదు, ఎన్నికల కార్యాచరణపై మండల అధ్యక్షుడు అజిత్ సింహారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండలంలో స్థానిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకునే విధంగా పనిచేయాలన్నారు. ఉందెకోడ్ గ్రామ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీని వీడీ బీజేపీలో చేరారు. కార్యక్రమంలో లలితమ్మ, కుర్వ సత్యం, వెంకటేశ్వరరావు, జగన్నాథం, నీరజ్, లక్ష్మారెడ్డి, విజయరామ్, యాదవరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కావాల్సినంత యూరియా అందించాలి

» మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రైతులకు కావాల్సినంత యూరియాను తక్షణమే అందించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ముందుచూపుతో బఫర్ నిల్వలు ఉంచుకోవడంతోనే సమస్య ఏర్పడిందన్నారు. రైతులు రెండు మూడు సార్లు కేంద్రాల వద్దకు వెళ్లి క్యూలో నిలబడితే తప్పా యూరియా దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. నియోజకవర్గంలో సాగు గణనీయంగా పెరిగిందన్నారు. సరైన నిల్వలు ఉంచుకోకపోవడంతో కొరత ఏర్పడిందన్నారు. రైతులకు 12లక్షల మెట్రిక్ టన్నుల అవసరం ఉండగా ఇప్పటి వరకు 3,847టన్నుల యూరియా అందించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు యూరియా అందించాలని, మరోసారి ఇలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భూ నిర్వాసితులకు నల్లగొండ జిల్లాలో ఎకరాకు రూ.25లక్షలు ఇచ్చి మక్తల్ నియోజకవర్గంలో రూ.14లక్షలు ఇస్తామనడం ఏమిటన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చిన్న హన్మంతు, మొగిలప్ప, అన్వర్ హుసేన్, మన్నాన్, శివారెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిసేవా సమితి కమిటీ ఎన్నిక



మక్తల్ రెడ్డి సేవా సమితి నూతన కార్యవర్గ సభ్యులు

మక్తల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రెడ్డి సేవా సమితి మండల కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలో ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తెలిపారు. సమాజంలో పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తూ రెడ్డి సేవా సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రాఘవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బలరాంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కార్యదర్శులుగా విష్ణువర్దన్‌రెడ్డి, కోశాధికారిగా దేవేందర్‌రెడ్డి, మరో పది మంది సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, బలరాంరెడ్డి, సంతోష్‌రెడ్డి, మల్లారెడ్డి, లింగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగనూరులో..

మాగనూరు: ఉమ్మడి కృష్ణ, మాగనూరు మండలం రెడ్డి సేవాసమితి మండల కమిటీని ఆదివారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరామారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా పురుషోత్తంరెడ్డి, సుగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మైపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి అరవింద్‌రెడ్డి, పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రహ్లాద్‌రెడ్డి, ఎల్లారెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మహాదేవ్ కుటుంబానికి నగదు అందజేస్తున్న స్నేహితులు

మక్తల్ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచలింగాల గ్రామానికి చెందిన మహాదేవ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆదివారం మక్తల్ పదో తరగతి మిత్ర బృందం మహాదేవ్ కుటుంబ సభ్యులకు రూ.32వేల నగదు అందజేశారు. వారి కుటుంబ సభ్యులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని మిత్ర బృందం తెలిపారు. కార్యక్రమంలో గోవర్దన్, అంజి, రామలింగం, రాజు, తిమ్మప్ప, నరసింహ, రాము, గోవిందు, చెన్నప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.